తారు రోడ్ల నిర్మాణంలో రికార్డు

- పుంగనూరు తర్వాత పుట్టపర్తికే స్థానం
- గ్రామీణులకు మెరుగైన సౌకర్యం
- 69 రోడ్లలో పనులు పూర్తి
- ప్రభుత్వ చర్యలపై హర్షం



వందేళ్ల తరువాత వేసిన జగరాజుపల్లి రోడ్డు



10 గ్రామాలకు కనెక్టివిటీ పెంచే కరావులపల్లి-బండ్లపల్లి రోడ్డు

పుట్టపర్తి అర్బన్: గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామీణ రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేసింది. ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయాణం సాఫీగా సాగేలా తారు రోడ్ల నిర్మాణం చేపట్టింది. ఈక్రమంలో చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం తర్వాత రాయలసీమలో అత్యధికంగా తారు రోడ్లు నిర్మించినది పుట్టపర్తి నియోజకవర్గంలోనే. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకొని నాలుగున్నర ఏళ్లలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి గ్రామాలకు తారు రోడ్లు నిర్మిస్తున్నారు.

సాఫీగా ప్రయాణం

పుట్టపర్తి నియోజకవర్గంలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, నల్లమాడ, ఓడీ చెరువు, అమడగూరు మండలాలు ఉన్నాయి. ఇందులో అత్యంత వెనుకబడిన మండలం అమడగూరు. ఇందులో ఏ గ్రామానికీ సరైన రహదారి సౌకర్యం లేక 108 కూడా వెళ్లలేని పరిస్థితి ఉండేది. సదరు మండలానికి అధికారులు వెళ్లాలంటేనే ఇబ్బంది పడేవారు. అధికారులు కూడా బదిలీ చేయించుకొని వెళ్లిన దాఖలాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అమడగూరు మండలంలో ఏకంగా 27 రోడ్లను రూ.25.46 కోట్లతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే 23 రోడ్లు పూర్తి కాగా 4 రోడ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఓడీ చెరువు మండలంలో 28 రోడ్లకు రూ. 25.77కోట్లు మంజూరయ్యాయి. 25 రోడ్ల పనులు పూర్తయ్యాయి. ఈ రెండు మండలాల్లో ఏకంగా 83 గ్రామాల ప్రజలు లబ్ధి పొందారు.

మండలాలు	06
మంజూరైన రోడ్లు	82
పూర్తయిన రోడ్లు	69
మంజూరైన నిధులు	రూ.90.16 కోట్లు
రోడ్ల పొడవు	186.24 కిలోమీటర్లు
అనుసంధానించిన గ్రామాలు	118

వందేళ్లనాటి గ్రామానికి రోడ్డు

పుట్టపర్తి మండలం జగరాజుపల్లి గ్రామం ధర్మవరం-బెంగళూరు ప్రధాన రోడ్డుకు రెండు కిలోమీటర్ల దూరం ఉంది. వందేళ్లుగా ఈ గ్రామానికి తారు రోడ్డు లేదు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చొరవ చూపి రోడ్డు వేయించారు. అదేవిధంగా అటవీ ప్రాంతాలైన అమగొండపాళ్యం, బొంతలపల్లి, రాగప్పగారిపల్లి గ్రామాలకు కనెక్టివిటీ పెంచారు. ఇక పుట్టపర్తి, నల్లమాడ, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లో 27 రోడ్లు మంజూరు కాగా ఇప్పటికే 21 రోడ్ల పనులు పూర్తి అయ్యాయి. పుట్టపర్తి నియోజకవర్గంలో మొత్తం 82 తారు రోడ్లు మంజూరు కాగా వీటికి రూ.90.16 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. సుమారు 186.24 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మిస్తున్నారు. మొత్తం 69 పనులు పూర్తి కాగా 13 పనులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. 118 గ్రామాలకు కనెక్టివిటీ పెరిగింది.

రోడ్ల నిర్మాణంతోనే గ్రామాల అభివృద్ధి



రోడ్ల ఏర్పాటుతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. అవసరమైన నిధులు సమకూర్చి తారు రోడ్లు వేయించాం. నియోజకవర్గంలో సుమారు వందేళ్లుగా సరైన రోడ్డు మార్గాలు లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి 6 మండలాల పరిధిలో 118 గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లు వేయించా. ఇప్పటికే 69 రోడ్లు నిర్మాణాలు పూర్తి చేసుకొని వాహనాలు సాఫీగా వెళ్తుంటే ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది నాకు ఎంతో సంతృప్తినిస్తోంది.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే

క్లుప్తంగా

పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీఓ గంగరత్నమ్మ

గాండ్లపెంట: చిన్నారులకు పాలిచ్చే తల్లులు పౌష్టికాహారం తీసుకుంటే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని కదిరి తూర్పు సీడీపీఓ గంగరత్నమ్మ తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు, తల్లులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం విలువలపై అవగాహన కల్పించి వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మాధవీలత, సూపర్‌వైజర్లు పద్మావతి, రఫీవున్నీసా, వెలుగు సీసీ షాకీర్ తదితరులున్నారు.

నూతన ఎస్‌ఐకు స్వాగతం



ఎస్‌ఐకు స్వాగతం పలుకుతున్న ఎంపీపీ

తాడిమర్రి: మండలంలోని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి ఎస్‌ఐ ఎం. నాగస్వామిని కోరారు. నూతన ఎస్‌ఐని మంగళవారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌లో కలిశారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇటీవల మండలంలోని గ్రామాల్లో ఘర్షణలు, దొంగతనాలు అధికమయ్యాయన్నారు. పోలీసులను అప్రమత్తం చేసి అరికట్టాలని ఆయన ఎస్‌ఐని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మారక శివారెడ్డి, సొరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో మంచి దిగుబడి



సూచనలిస్తున్న శాస్త్రవేత్త శశికళ

ఎన్‌పీకుంట: ముందస్తు ప్రణాళికతో పంటలు సాగు చేస్తే దిగుబడి దక్కుతుందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.శశికళ రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ధనియానిచెరువు, మరికొమ్మదిన్నె గ్రామాలలోని ఆర్బీకేలో కేవీకే, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (వాటర్ షెడ్ పీఎంకెఎస్‌వై) ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాయాన్ని రెట్టింపు చేసే ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు నవీన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బాలానాయక్, వాటర్‌షెడ్ చైర్మన్లు క్రిష్టారెడ్డి, ఓబుళరెడ్డి, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.


ఏకాగ్రతతో పూజించాలి

ధర్మవరం అర్బన్: ప్రతి ఒక్కరూ భగవంతున్ని ఏకాగ్రతతో పూజించాలని అప్పుడే ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని కేరళ ఆనందాశ్రమం చంద్రానంద మాతాజీ తెలిపారు. పట్టణంలోని సాంస్కృతిక మండలిలో మంగళవారం రాత్రి వివేకానంద యోగ కేంద్రం, ధర్మవరం యోగా అసోసియేషన్ సంయుక్తంగా భగవద్గీత సాధన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేరళ రాష్ట్రంలో ఉన్న ఆనందాశ్రమంలోని మాతాజీ స్వామిని చంద్రానంద హాజరయ్యారు. కార్యక్రమంలో యోగా అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్‌రెడ్డి, తిరుమలేసు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్‌పై దాడి

కదిరి టౌన్: అమీన్‌నగర్‌లో ఉన్న పద్మాష్ చర్చ్ పాస్టర్ సునీల్‌పై దాడి జరిగింది. పట్టణానికి చెందిన కృపాకర్, జాషువా జాబీద్, తనుజ్, ప్రసాద్, దానం, ఆనంద్‌లు మంగళవారం రాత్రి దాడి చేసి గాయపరిచారు. చర్చ్ గేట్ పగలకొట్టారు. కుటాగుళ్ల పాస్టర్ జాషువా దురుద్దేశంతో తన అనుచరులను పంపి దాడి చేయించారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

అమడగూరు: అమడగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎస్‌ఐ వెంకటనారాయణ, ఎంఈఓలు ప్రారంభించారు. అనంతరం వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, లాంగ్‌జంప్, షాట్‌పుట్ పోటీలను నిర్వహించి జట్లను ఎంపిక చేశారు.

సంఘాల బలోపేతానికి చేయూత



సీసీలను సన్మానిస్తున్న దృశ్యం

కనగానపల్లి: డ్వాక్రా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చేయూతనిస్తోందని, మహిళల కోసం వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ తదితర పథకాలు అమలు చేస్తోందని ఏపీఎం హేమలత తెలిపారు. మంగళవారం స్థానిక వైకేపీ మహిళా భవనంలో వీరబ్రహ్మేంద్ర మండల సమైక్య వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మండల సమైక్య లీడర్లతో పాటు పలువురు గ్రామ సంఘాల లీడర్లు, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు. ఏపీఎం మాట్లాడుతూ మండల సమైక్యను స్థాపించి 11 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. అనంతరం మండల సమైక్య కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో సంఘం లీడర్‌గా పి.నల్లమ్మ, ఉపాధ్యక్షురాలిగా సువర్ణ, కార్యదర్శిగా రాములమ్మ, సహకార్యదర్శి మణి, కోశాధికారిగా దివ్యశ్రీని ఎన్నిక చేశారు.

సిబ్బందికి సన్మానం: మండలంలో సీసీలుగా పని చేస్తూ ఈ మధ్య కాలంలో ఇతర మండలాలకు బదిలీపై వెళ్లిన ఆనంద్, సోమశేఖర్‌లను మండల సమైక్య సభ్యులు సన్మానించారు.

సమన్వయంతో ముందుకెళ్లండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

తనకల్లు: మండల అధికారులు సమన్వయంతో ముందుకెళ్తూ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వైవీ కౌసల్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మారుమూల గ్రామాలకు సైతం తారురోడ్లు వేయించామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా గుర్తించిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వంద శాతం ఈ-క్రాప్ బుకింగ్ చేసి ఒక్క రైతు కూడా నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. మండలానికి ప్రభుత్వం నూతనంగా 201 పింఛన్లు మంజూరు చేసిందన్నారు. హంద్రీ-నీవా జలాలతో సీసీ ప్రాజెక్టుతో పాటు అన్ని చెరువులను నింపి తాగు, సాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు పేర్కొన్నారు. సీజీ ప్రాజెక్టు వరకు హంద్రీ-నీవా కాలువ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 2.25 కోట్లు విడుదల చేసిందన్నారు. ఇప్పటికే కాలువ పనులు 80 శాతం పూర్తి చేశామన్నారు. అర్హులైన పేదలకు అసైన్డ్‌మెంట్ భూములను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీలలో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని, బిల్లులు సకాలంలో చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ భవనాల కోసమే ప్రతి మండలానికి రూ. కోటి చొప్పున నిధులు విడుదలయినట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలను వెంటనే పూర్తి చేయాలని, నిర్మాణ పనులు పూర్తి అయిన వెంటనే బిల్లులను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. జల జీవన్ మిషన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూల నరసింహులు, తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, వైస్ ఎంపీపీలు నాగలక్ష్మి, రమణమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంఈఓ కళ్యాణి, కో- ఆప్షన్ రహంతుల్లా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, నాయకులు శ్రీనివాసులునాయుడు,సర్పంచులు,ఎంపీటీసీలు , తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బేల్దారి మృతి



అనిల్ కుమార్ (ఫైల్)

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని పోతుకుంట గ్రామానికి చెందిన అనిల్ కుమార్ (32) అనే బేల్దారి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. నాలుగు రోజుల క్రితం పోతుకుంట బీసీ కాలనీ వద్ద ద్విచక్ర వాహనంలో వెళ్తున్న అనిల్‌కుమార్‌ను ఆటో ఢీకొంది. ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. చికిత్స ఫలించక అనిల్‌కుమార్ మృతి చెందాడు. మృతునికి భార్య అర్చన, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్ భర్త అంగజాల రాజు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం అంగజాల రాజు రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు.

క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి

ధర్మవరం అర్బన్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఆర్టీసీ డీఎం మోతిలాల్‌నాయక్, దాత చింతా మోహన్ తెలిపారు. పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే 300 మంది విద్యార్థులకు మంగళవారం దాత చింతా రంగయ్య, ఆర్టీసీ డీఎం మోతిలాల్ నాయక్, పాఠశాల హెచ్‌ఎం ఉమాపతి చేతులమీదుగా ఉచిత బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు అందజేయడం అభినందనీయమన్నారు. ఉచిత బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకుని పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చి విద్యలో రాణించాలని సూచించారు. ఆటోలలో వచ్చి ప్రమాదాలకు గురికాకుండా ఉచిత బస్‌పాస్‌లతో ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంప్రసాద్, ఆర్టీసీ యూనియన్ నాయకులు నాగార్జునరెడ్డి, బాబు, వైవీఎస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ప్రజల ఇంటి వద్దకే వెళుతూ వారి సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కరించడానికే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఒకటో వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నిర్వహించారు. వార్డులోని ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారులు, కాలువలు నిర్మించాలని పలువురు ఎమ్మెల్యేకు విన్నవించారు. వీధిలైట్లు పడటం లేదని వాపోయారు. జగనన్న కాలనీలో ఇళ్లు వచ్చాయని, బిల్లులు పడలేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిందన్నారు. ఉద్యోగులంతా తప్పనిసరిగా ప్రజలకు సేవ చేయాలని ఆదేశించారు. మర్యాదగా మాట్లాడుతూ వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రతి పథకాన్ని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షేక్ షంషాద్‌బేగం, వార్డు కౌన్సిలర్ చెలిమి ఆదిలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ చెలిమి పెద్దన్న, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై అవగాహన

ఎన్‌పీకుంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్ వర్ధన్ ఆధ్వర్యంలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎమ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న ఆయా గ్రామాలలో వలంటీర్లు వారి పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న కార్యక్రమంపై అవగాహన కల్పించేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. 16 నుంచి ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎమ్, సీహెచ్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే యాప్‌లో వారి వివరాలు నమోదు చేయాలని, ఆరోగ్య సమస్యలు ఉండే వారిని 30 నుంచి గ్రామాల్లో నిర్వహించనున్న వైద్య శిబిరాలకు పంపించాలని సూచించారు.

గాండ్లపెంటలో..

గాండ్లపెంట: వలంటీరుతో పాటు ఆరోగ్య సిబ్బంది ఇంటింటినీ సందర్శించి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంపై అవగాహన కల్పించాలని వైద్యాధికారి మహేశ్వరమారుతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాతం జగన్‌మోహన్ అధ్యక్షతన మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమ విధివిధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మోహన్‌రామ్, ఎంపీడీఓ రామానాయక్, వైద్యాధికారి బాబాఫక్రుద్దీన్, సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి పాల్గొన్నారు.

16 నుంచి కార్యక్రమాలు

చెన్నేకొత్తపల్లి: ఈనెల 16 నుంచి 29 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగావతి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రవినాయక్, సీహెచ్‌ఓ గోవిందమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంఈఓలు మున్వర్ బాషా, ప్రసన్నకుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

ధర్మవరం రూరల్: గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ కార్యాలయ పరిపాలన అధికారి అబ్దుల్ నబీ, మెడికల్ ఆఫీసర్ దిలీప్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో 14 సచివాలయాలకు సంబంధించిన ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు



మాట్లాడుతున్న ఆవుల శేఖర్

పుట్టపర్తి అర్బన్: బాపట్లలో ఈనెల 25వ తేదీన జరగనున్న రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి గణేష్ సర్కిల్‌లోని షాదీ మహల్‌లో జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ కార్యదర్శి వేమయ్య యాదవ్‌తో కలిసి సమావేశంలో మాట్లాడారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి భూ పంపిణీ చేశారని, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పంపిణీ చేయలేకపోయాయన్నారు. అర్హులైన పేదలకు సీఎం వైఎస్ జగన్ నిర్వహించే భూ పంపిణీ కార్యక్రమంలో చోటు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి, నాయకులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని తుంపర్తి గ్రామంలో మంగళవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుని గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని శ్రీకృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేసి వారం రోజుల పాటు విశేష పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా తుంపర్తి కమిటీ అధ్యక్షుడు అప్పిరెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు.

నేడు నూతన పెన్షన్ల పంపిణీ

నల్లచెరువు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రమణారెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలి రావాలని కోరారు.

నేడు క్రీడా పోటీలు

కనగానపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీ రమేష్ తెలిపారు. బాలబాలికలకు రెండు విభాగాలుగా జరిగే ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్‌తో పాటు కొన్ని అథ్లెటిక్స్ నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేవారు ఉదయం 8 గంటల లోపు పాఠశాల వద్దకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ముదిగుబ్బలో..

ముదిగుబ్బ: మండల స్థాయిలో మంగళవారం క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు ఎంఈఓలు రమణప్ప, కిరణ్మయి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముదిగుబ్బ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అండర్-14, అండర్-17లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

అన్నదానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం వాసవి నారాయణ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో రోగులు, సహాయకులకు అన్నదానం చేశారు. దాతలు బండ్లపల్లి రఘునందన్ జ్ఞాపకార్థం భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు బండ్లపల్లి రంగనాథ్‌ల సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవి నారాయణ సేవా సమితి అధ్యక్షుడు ఓవీ ప్రసాద్, కాకుమాని విద్యాసాగర్, శ్రీరామప్రసాద్, సుధీర్, చలపతి, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక

బత్తలపల్లి: ఫుట్‌బాల్ రాష్ట్ర సబ్ జూనియర్స్ అండర్-13 బాలికల జట్టులో బత్తలపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శిల్పా సుబ్రహ్మణ్యేశ్వరి స్థానం సంపాదించినట్లు శిక్షకుడు దుర్గాప్రసాద్ తెలిపాడు. ఈ నెల 15 నుంచి 29 వరకు నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలు కర్నాటక రాష్ట్రం బెల్గాంలో జరుగుతాయన్నారు.

సేవాభావంతో పని చేయండి

బత్తలపల్లి: సచివాలయాల్లో సిబ్బంది సేవాభావంతో పని చేయాలని ఎంపీడీఓ సౌజన్యకుమారి సూచించారు. మంగళవారం మండలంలోని తంబాపురం, డి.చెర్లోపల్లి గ్రామ సచివాలయాలను ఆమె అకస్మికంగా తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి నారాయణస్వామి, ఆయా సచివాలయాల్లోని సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకోండి

అమడగూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి వెంకటరమణా చారి పేర్కొన్నారు. ఇంతవరకూ పథకం వర్తించని వారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబరుతో ఆర్బీకే సిబ్బందిని సంప్రదించాలన్నారు. పథకం ద్వారా పీఎం కిసాన్‌తో కలసి ఏడాదికి నాలుగు విడతలుగా రూ.13,500 జమవుతుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.